క్లుప్తంగా

నేడు గుంతూరులో గడప గడపకు మన ప్రభుత్వం

బంగారుపాళెం: మండలంలోని గుంతూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో కుంభాభిషేక పూజలు



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కుమ్మరవీధిలోని శ్రీ షిరిడిసాయిబాబా మందిర మహా కుంభాభిషేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దీనికి ముఖ్య అతిథిగా హాజరై బాబాను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం



దుర్గానగర్ కాలనీలో నేలకూలిన విద్యుత్ స్తంభం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం కురిసిన గాలీవానకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక దుర్గానగర్ కాలనీ విద్యుత్ స్తంభం పడిపోగా, వెంగనపల్లెలో గాలికి లైన్‌పై కొమ్మ పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పలు ప్రాంతాల్లో నాలుగు గంటలకు పైగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఏఈలు బాలచంద్ర, లోకేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సంరక్షణ పనులు చేపట్టారు.

వేడుకగా అర్జున తపస్మాన్



తపస్సుమాను ఎక్కి పద్యాలు ఆలపిస్తున్న అర్జున వేషధారి

ఐరాల: మండలంలోని నాంపల్లె రెవెన్యూ గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద గురువారం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. నిర్వాహకులు తపస్మాన్‌కు పూజలు చేసిన అనంతరం అర్జున వేషధారి తపస్మాన్ మెట్టు, మెట్టునూ అధిరోహిస్తూ శివుడి పాటలు, పద్యాలు ఆలపిస్తూ పైభాగానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అర్జున వేషధారి విసిరిన నిమ్మకాయలు, పండ్లు, పూలు మొదలైన వాటికోసం భక్తులు ఎగబడ్డారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా థామస్



చిత్తూరు అర్బన్: జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా థామస్‌ను నియమించనున్నట్లు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జీడీనెల్లూరులో వర్గపోరు నెలకొన్న నేపథ్యంలో థామస్ నియామకం ఎలాంటి పరిణామాలకు దారితీస్తోందో వేచి చూడాల్సి ఉంది.

తొలకరితో ఖరీఫ్‌కు శ్రీకారం

- సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగం
- ఆరంభమైన దుక్కుల దున్నకం



తవణంపల్లె సమీపంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

తవణంపల్లె: ఇటీవల తొలకరి పలకరించడంతో అన్నదాత ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టాడు. దుక్కుల దున్నకంలో రైతులు తలమునకలై ఉన్నారు. దుక్కులు పూర్తయిన వారు పొలానికి ఎరువులు తరలిస్తున్నారు. అదునులో తొలిసారి వర్షం కురవడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. మొన్నటివరకు ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన మండలవాసులకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది. ఆశించిన స్థాయిలో వర్షం కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుపై దృష్టి సారించారు. రైతులు పొలాలను శుభ్రం చేసి దుక్కులు దున్నుతున్నారు. దిబ్బల వద్ద జేసీబీ యంత్రాలతో ట్రాక్టర్లకు ఎరువులు నింపి పొలాలకు తరలిస్తున్నారు. పొలాలు సారవంతంగా చేయడానికి రైతులు ముందస్తుగా దుక్కులు సిద్ధం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచింది. నేటి నుంచి పంపిణీకి అధికారులు సమాయత్తమవుతున్నారు.

దుక్కులు లోతుగా దున్నాలి

వేరుశనగ పంట సాగులో భాగంగా తొలకరి వర్షాలు కురవడంతో రైతులు లోతుగా దుక్కులు దున్నడం మంచిది. దీని వల్ల భూమిలో ఉన్న క్రిమి కీటకాలు బయటకు వచ్చి సూర్యరశ్మికి చనిపోతాయి. భూమిపైన తిరిగే పురుగులను పక్షులు కూడా భుజించడంతో నశిస్తాయి. లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో తేమశాతం పెరుగుతుంది. వర్షాలు పడడం వల్ల భూమిని వాలుకు అడ్డంగా దున్నడం వల్ల కోతలు నివారించి భూసారాన్ని పెంపొందించుకోవచ్చు.

2692 హెక్టార్లలో వేరుశనగ సాగు లక్ష్యం

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 2,692 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకొంది. ఈ దిశగా మండలానికి రాయితీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేస్తున్నారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు నిల్వ చేశారు. ఆర్‌బీకేల్లో వేరుశనగ విత్తనాలతో పాటు ఎరువులు కూడా విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.





ట్రాక్టర్‌కు పశువుల ఎరువు నింపుతున్న జేసీబీ, టి.పుత్తూరు ఆర్‌బీకేలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనాలు

విత్తనాలు పంపిణీకి సిద్ధం



మండలంలో ఖరీఫ్‌లో ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేస్తున్నారు. మండలానికి వేరుశనగ విత్తనాలు1,620 క్వింటాళ్లు కేటాయించారు. ప్రస్తుతం మండలంలోని 13 ఆర్‌బీకేల్లో 1130 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన 4 ఆర్‌బీకేలకు రెండు రోజుల్లో విత్తనాలు వస్తాయి. 30 కిలోల బస్తా విత్తనాలు రాయితీతో రూ.1,674కు విక్రయించడానికి ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఖరీఫ్‌లో సాగు పెట్టుబడి కోసం వరుసగా ఐదవ సంవత్సరం మొదటి విడతగా జూన్ 1న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల ఖాతాలకు రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు జమ చేయనున్నారు. మండలంలో 2,692 హెక్టార్లలో వేరుశనగ సాగు చేయాలనే లక్ష్యంతో విత్తనాలు సరఫరా చేస్తున్నాం.

– ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

రైతుల పక్షపాతి సీఎం జగన్



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, అధికారులు

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎంఎస్.బాబు మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు పెట్టుబడి కోసం రైతు భరోసాను ఆయా రైతుల ఖాతాలను జమ చేసి రైతు బిడ్డగా నిలిచారని అన్నారు. రైతులు రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు విత్తనాలు విత్తి మంచి దిగుబడి సాధించాలని చెప్పారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లోనూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలోనే విత్తనాలు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసి విత్తనాలు వేస్తే చీడలు, పీడలు రాకుండా మంచి దిగుబడి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, పార్టీ నాయకులు రమణారెడ్డి, కిషోర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, మధుకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అరగొండలో బాలికల జూనియర్ కళాశాల



విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపక బృందం

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవికి హెచ్ఎం రమాబాయి, అధ్యాపకులు, ఇంటర్ విద్యార్థులు పూజ చేసి తరగతులను ప్రారంభించారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో విద్యార్థులను అడ్మిషన్లు చేస్తున్నట్లు హెచ్ఎం రాధాబాయి తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడానికి అన్ని సబ్జెక్టులకు సంబంధించి ఏడుగురు అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందని వివరించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో చదివి పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి అవగాహన కల్పించి అడ్మిషన్లు చేయడానికి వారిచేత అంగీకార పత్రం నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని బాలికలు ఇంటర్ చదవడానికి అనువుగా కళాశాల ఉండడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కాలేజీలో చేరాలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి అధ్యాపకులు బృందంతో గ్రామాల్లో తిరుగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయచంద్ర, మదనయ్య, చాన్ బాషా, ధనలక్ష్మి, తిలక్, మమత, సోమశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ



భూమి పూజలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక అనుప్పల్లె జగనన్న హౌసింగ్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమిపూజ చేశారు. జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కాలనీతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా భవిష్యత్‌లో ఇవ్వనున్నమన్నారు. చిత్తూరు నగరంలో బాలంబట్టు, గుడిపాలలో బొమ్మసముద్రం, జీడీనెల్లూరు నియోజకవర్గంలోని బాలగంగనపల్లె ప్రాంతంలో సబ్‌స్టేషన్లకు త్వరలో భూమిపూజ చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌ను దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



కొత్తబస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్



రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించిన అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, జిల్లా కార్మిక శాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో గురువారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని రూ.50 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బడికి వెళ్లాల్సిన వయసులో పనికి వెళ్లడం తప్పని చెప్పారు. కార్యక్రమంలో డీఎం రూపశ్రీ, ఏఎల్ఓ జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం

కార్వేటినగరం: మండలంలోని కొటార్వేడు సచివాలయ భవనం, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమయ్యాయి. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నూతన భవనాలను ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు. గతంలో ఇరుకుగా ఉన్న పంచాయతీ కార్యాలయాల్లో పాలన అసౌకర్యంగా సాగేది. ప్రస్తుతం రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేపట్టారు. దీంతో తమ గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందుతాయని, అధికారులు ఇక్కడే ఉండడం వల్ల ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం కూడా ఇదే తొలిసారి. టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ.20 లక్షలతో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి గొల్లకండ్రిగ గ్రామంలో, గొల్లకండ్రిగ దళితవాడలో హిందూ ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సచివాలయ పరిధిలో 3,165 మంది జనాభా, 436 కుటుంబాలు, 16 గ్రామాలు ఉన్నాయి. 16 మంది వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు.

వసంతాలతో ముగిసిన మహాభారత యజ్ఞం



పాండవులను ఊరేగిస్తున్న దృశ్యం

గుడిపాల: వసంతాలతో గురువారం మహాభారత యజ్ఞం ముగిసింది. మండలంలోని వసంతాపురంలో 35వ సారి మహాభారత యజ్ఞం మే 14న ప్రారంభించి మే 31తో పూర్తయ్యింది. ఈ క్రమంలో ద్రౌపదీ, అర్జున, భీమసేనులతో పాటు నకులం సహదేవులు, శ్రీకృష్ణస్వామిని ఊరేగించి వసంతాలతో ముగించారు.

గృహ నిర్మాణ పనుల్లో మరింత పురోగతి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి కనిపించాలని ఎంపీడీఓ గౌరి ఆదేశించారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆమె ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 902 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారన్నారు. మిగిలిన 800 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి వేగంగా పూర్తి చేయించాలన్నారు. పర్యటనకు వెళ్తే కచ్చితంగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిఆవు మృతి

బంగారుపాళెం: మండలంలోని ఎర్రాండ్లపల్లె దళితవాడలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై పాడిఆవు మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. గ్రామానికి చెందిన రైతు రత్నం పాడి ఆవును ఇంటి ఆవరణలో కట్టి ఉండగా సమీపంలోని విద్యుత్ స్తంభంపై నుంచి విద్యుత్ తీగ తెగి ఆవుపై పడడంతో షాక్‌కు గురై మృతి చెందిందని వాపోయాడు. ఆరు నెలల క్రితమే పాడి ఆవును కొనుగోలు చేసినట్లు చెప్పాడు.

వలంటీర్లకు సన్మానం





వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సన్మాన కార్యక్రమంలో వలంటీర్లు

చిత్తూరు అర్బన్: నగరంలోని 47, 48, 49, 50 డివిజన్‌లో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని వలంటీర్లను సన్మానించారు. ప్రభుత్వ పథకాల అమలును మరింత విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సహదేవ, రామ్ గణేష్, నారాయణ, జ్ఞానజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని సచివాలయ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లను గురువారం సర్పంచ్ మాసిలామణి సన్మానించారు. 25 మంది వలంటీర్లు సేవామిత్ర అందుకున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు పరిష్కరించడంలో వలంటీర్లు ముందుండాలన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, వైస్ ప్రెసిడెంట్ లోకనాథరెడ్డి, షణ్ముగం, రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకపోతే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పూతలపట్టు: ఉపాధి పనుల్లో పనితీరు మెరుగ్గా లేకపోతే చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఉపాధి కూలీలను 2 వేల మందికి పెంచాలని తెలిపారు. కేటాయించిన లక్ష్యాలను సరిగ్గా పూర్తి చేయకుండా మండలం జిల్లాలోనే చివరి స్థానంలో ఉందని తెలిపారు. ఉపాధి కూలీల లక్ష్యాలను పూర్తి చేయనందున అయ్యప్పగారిపల్లి, ఎర్రచెరువుపల్లి, పేటఅగ్రహారం పంచాయతీలను గతంలో సస్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అదే పనితీరులో ఉన్న 5 పంచాయతీలకు సమయం కేటాయించారు. వారంలో లక్ష్యాలను పూర్తిచేయకపోతే పూర్తిగా విధుల నుంచి తొలగిస్తానని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. ప్రోగ్రెస్ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని తెలిపారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, ఏపీఓ సౌభాగ్యవతి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటివద్దకే వైద్యం



వైద్యం అందిస్తున్న డాక్టర్ ప్రవీణ



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రష్మిత

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని ఏఎల్‌పురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది స్వర్ణలత, కవిత, కార్లినమ్మ పాల్గొన్నారు.

చిటిపిరాళ్లలో65 మందికి వైద్య పరీక్షలు

పూతలపట్టు: మండలంలో చిటిపిరాళ్ల పంచాయతీలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో గురువారం డాక్టర్ ప్రవీణ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలోని 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. ప్రత్యేకించి గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి ఐరన్ సుక్రోజన్ మాత్రలు అందజేశారు. తగు సూచనలు, సలహాలు తెలిపారు. డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించాలనే ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విలువైన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు తెలియజేశారు.

మత్యంలో76 మందికి వైద్య సేవలు

తవణంపల్లె: ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మత్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 76 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, తులసి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ జాన్సీ, ఆశావర్కర్లు రేణుక, అశ్విని, లక్ష్మీ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం



పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. జొన్నగురకలలో జయచంద్ర ఇంటి దగ్గర ఉన్న పెద్ద కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంటిలో ఏడుగురు ఉన్నారు. వీరిలో ఇద్దరు పిల్లలు స్పృహ తప్పి కిందపోయి 20 నిమిషాలు తర్వాత తేరుకున్నారు. ఇంటిలో టైల్స్ కూడా బీటలు వారాయి. గ్రామస్తులు భయాందోళన చెందారు. కొబ్బరి చెట్టు చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

ఉరుములు మెరుపులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారాయి. తర్వాత 7.30 గంటల సమయంలో మళ్లీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో పాటు బలమైన ఈదురుగాలుల దాటికి మామిడి కాయలు నేలరాలయి. అయితే వేరుశనగ సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ వర్షంతో రైతుల్లో దుక్కులు చేసేందుకు సిద్ధమయ్యారు.